జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 26 4-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06









# లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత... 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

## బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్

- చైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం
- చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే,

- మిగతా 2వ పేజీలో

# ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ



- రాష్ట్రాన్ని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చడమే లక్ష్యమన్న సీఎం
- లంబసింగిలో పీపీపీ విధానంలో కుంకుమపువ్వు సాగుకు ప్రణాళిక
- ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం
- రైతుల కోసం డిజి రైతు బజార్, కిసాన్ డ్రోన్ యాప్‌ల ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏలూరు జిల్లాలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కోకో సిటీలో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని

మిగతా 2లో



# హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

- వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి
- ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి

2లో

# జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

- ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో వ్యవసాయ కూలీలు మృతి
- పసుపు కోతకు వెళ్లి వస్తుండగా నీటి గుంతలో పడిన ట్రాక్టర్
- గాయపడిన వారు సమీపంలోని ఆసుపత్రికి తరలింపు

2లో

# ప్రచారానికి మిగిలింది వారమే

- సర్వేల్లో 90% కాంగ్రెస్‌కే సానుకూలం.. మునిసిపోల్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి
- ఇన్‌చార్జి మంత్రులు అందర్నీ కలుపుకొని వెళ్లాలి.. రెండ్రోజులకోసారి జూమ్‌లో భేటీ
- మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి.. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్ష
- వార్డుల్లో బీసీలకు 56 ఇచ్చినట్లు లెక్క.. రెబెల్ అభ్యర్థులు 2 లోపేనని గుర్తింపు



హైదరాబాద్, ఫిబ్రవరి 3 : మునిసిపల్ ఎన్నికల ప్రచారానికి ఇంకా వారం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ఈ కీలక దశలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠకు సంబంధించినవిగా భావించి, సమిష్టిగా ముందుకు సాగాలని మంత్రులకు స్పష్టం చేశారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ ఎన్నికలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా 2లో



# ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్...

- కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు
- రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా
- అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం
- ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ఎంపీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కాగా, రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు,

2లో

# సిట్ నివేదికను కాదని విమర్శలా?



## జంతువుల కొవ్వు కలవలేదని నివేదిక ఇచ్చాక విచారణలా?

## అడ్డంగా దొరికిపోవడంతోనే చంద్రబాబు తంటాలే

## టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

తిరుపతి, : తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూలో జంతుకొవ్వు, పంది కొవ్వు, చేప నూనె కలిపిన నెయ్యి వాడారని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విపరీతంగా దుష్ప్రచారం చేసిన సీఎం చంద్రబాబు అడ్డంగా దొరికి పోయారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ధ్వజమెత్తారు. అందులో ఏ మాత్రం వాస్తవం లేదన్న సీబీఐ సిట్ ఛార్జ్‌షీట్‌తో అడ్డంగా దొరికిపోయి, తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నానాపాట్లు పడుతున్నారని విమర్శించారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం నియమించిన సిట్, నెయ్యిలో ఏ కొవ్వూ కలవలేదని చెప్పినా, మళ్లీ ప్రభుత్వం ప్రత్యేక విచారణ చేయించాలని నిర్ణయించడమే ఇందుకు నిదర్శనం అని ఆయన వెల్లడించారు. ప్రభుత్వానికి చేతనైతే సిట్ రిపోర్ట్ తప్పని సుప్రీంకోర్టును ఆశ్రయించి, అక్కడ రుజువు చేయాలని తిరుపతిలో మీడియాతో మాట్లాడిన భూమన కరుణాకర్‌రెడ్డి సవాల్ చేశారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ అధికారుల్ని సీఎం చంద్రబాబు పిలిపించుకోవడం అసాధారణ విషయం. వారి దగ్గరి నుంచి 11 పేజీల నివేదిక తీసుకుని సుదీర్ఘమైన చర్చ చేశామని కేబినెట్ భేటీ నుంచి బయటికి వచ్చిన

మిగతా 2లో



# నరేంద్ర మోదీపై ట్రంప్ ఒత్తిడి ఉంది

- వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ
- వాణిజ్య ఒప్పందంపై అమెరికాతో రాజీపడ్డారన్న రాహుల్ గాంధీ
- నెలలుగా నిలిచిపోయిన ఒప్పందం అకస్మాత్తుగా ఎలా ఖరారైందని ప్రశ్న
- అంతా అయ్యాక ప్రతిష్ఠ మసకబారుతుందేమోనని మోదీ ఆందోళన చెందుతున్నారన్న రాహుల్

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు. వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు. నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు.

## నరేంద్ర మోదీపై ట్రంప్ ఒత్తిడి ఉంది

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశాన్ని ట్రంప్‌కు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికాతో రాజీపడ్డారని అన్నారు. ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ, ట్రంప్ ఒత్తిడి కారణంగా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారని, అంతా అయ్యాక ఇప్పుడు తన ప్రతిష్ఠ మసకబారుతుందేమోనని మోదీ ఆందోళన చెందుతున్నారని అన్నారు. కొన్ని నెలలుగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందంపై నిన్న రాత్రి సంతకం చేశారని, అకస్మాత్తుగా ఇది ఎలా ఖరారైందని ఆయన ప్రశ్నించారు. ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉండటం వల్లే ఒప్పందం కుదిరిందని అన్నారు. ఎప్ స్టీన్ ఫైల్స్, అమెరికాలో వ్యాపారవేత్త అదానీపై కేసు వంటి వ్యవహారాలు దీనికి కారణమని ఆరోపించారు. ఎప్ స్టీన్ ఫైళ్లలో బయటికి రాని విషయాలు ఇంకా ఎన్నో ఉన్నాయని అన్నారు. రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారని మండిపడ్డారు. అంతకుముందు భారత ఆర్మీ మాజీ చీఫ్ నరవణే రాసిన ఆత్మకథలోని అంశాలపై లోక్‌సభలో రెండో రోజూ గందరగోళం కొనసాగింది. ప్రభుత్వం తనను సభలో మాట్లాడనివ్వలేదని రాహుల్ ఆరోపించారు. చరిత్రలో మొదటిసారి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేందుకు ఒక ప్రతిపక్ష నేతకు అనుమతి ఇవ్వలేదని మండిపడ్డారు.

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్...

(మొదటి పేజీ తరువాయి)

నిధులు రాబట్టేందుకు లోకేశ్ కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు. ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హై-స్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

## ప్రచారానికి మిగిలింది వారమే



ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు. ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలోని రాజకీయ పరిస్థితులపై మంత్రులు సమగ్ర నివేదికలను సీఎంకు సమర్పించారు. తాజా సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని సీఎం వెల్లడించారు. దాదాపు 90 శాతం మునిసిపాలిటీల్లో పార్టీ గెలుపు సాధిస్తుందనే అంచనాకు వచ్చినట్లు తెలిపారు. పార్టీ గుర్తుపై జరుగుతున్న ఈ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని మంత్రులకు సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు తమ పరిధిలోని స్థానిక నాయకులందరినీ కలుపుకొని వెళ్లాలని, పాతకొత్త నేతల మధ్య సమన్వయం సాధించాలని చెప్పారు. కొన్ని మునిసిపాలిటీల్లో నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఓట్లు చీలకుండా చూసే బాధ్యత పూర్తిగా మంత్రులు, స్థానిక నాయకులదేనని స్పష్టం చేశారు. మునిసిపల్ ఎన్నికలపై వారం రోజుల పాటు పూర్తిగా దృష్టి సారించాలని సీఎం రేవంత్ సూచించారు. ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లు, ఆదిలాబాద్, మెదక్ మునిసిపాలిటీల్లో మరింత శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై రెండురోజులకోసారి జూమ్ సమావేశాల ద్వారా ఎన్నికల పరిస్థితిని సమీక్షించనున్నట్లు తెలిపారు. సమీక్షలో బీసీ రిజర్వేషన్లపై కూడా చర్చ జరిగింది. వార్డులు, డివిజన్లలో సుమారు 56 శాతం మేర బీసీలకు కేటాయింపులు చేసినట్లు లెక్క తేలింది. అలాగే రెబెల్ అభ్యర్థుల సమస్యను చాలా వరకు నియంత్రించినట్లు పార్టీ అంచనాకు వచ్చింది. ఈ బెడద 12 శాతం లోపే ఉంటుందని భావిస్తూ, టీపీసీసీతో సమన్వయం చేసుకొని పూర్తిగా అదుపులో పెట్టాలని సీఎం సూచించారు. మునిసిపల్ ఎన్నికలు లేని జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలను పరిశీలకులుగా నియమించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ వంటి జిల్లాల నేతలను ఎన్నికలు జరుగుతున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు పంపనున్నారు.

# హైదరాబాద్‌లో ఫైర్ సేఫ్టీ పాఠాలు చెబుతున్న హైడ్రా

**హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు హైడ్రా అవగాహన కార్యక్రమాలు**

**వరుస ప్రమాదాల నేపథ్యంలో నగర ప్రజలను అప్రమత్తం చేసేందుకు చర్యలు**

**ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వాడకం, భద్రతా చర్యలపై ప్రాక్టికల్ డెమోలు**

**నిబంధనల అమలుకు వాణిజ్య సముదాయాలకు నెల రోజుల గడువు**

**నగరంలోని 30కి పైగా ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్, అవగాహన సదస్సులు**



హైదరాబాద్ నగరంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే లక్ష్యంతో ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన కల్పించేందుకు నగరం నలుమూలలా భారీ ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించింది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ షోరూంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పాటు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనలు ఈ చర్యలకు ప్రధాన కారణంగా నిలిచాయి. చాలా వాణిజ్య భవనాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని అధికారులు జరిపిన తనిఖీల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో, అగ్నిమాపక భద్రతా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేందుకు వాణిజ్య సంస్థలకు నెల రోజుల గడువు ఇస్తూనే, మరోవైపు ఈ అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ ప్రమాదం సంభవిస్తే మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలనే అంశాలపై వివరిస్తున్నారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగం, మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే ఆటోమేటిక్ వాటర్ స్ప్రింక్లర్లు, పొగను గుర్తించే స్మోక్ డిటెక్టర్ల పనితీరుపై ప్రాక్టికల్‌గా చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. షాపులు, కార్యాలయాల్లో ఫైర్ ఎగ్జిట్ మార్గాలను గుర్తించడం, వాటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతున్నారు. పంజాగుట్ట, మాదాపూర్, గచ్చిబౌలి-మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ క్లాక్ టవర్, అల్వాల్, బంజారాహిల్స్, శంషాబాద్, కొంపల్లి, నాంపల్లి వంటి 30కి పైగా ప్రధాన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కొన్ని చోట్ల ఫైర్ మాక్ డ్రిల్స్ కూడా నిర్వహించి, ప్రమాద సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో కార్మికులకు, వ్యాపారులకు సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖకు చెందిన 101 నంబర్‌తో పాటు, హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 1070 లేదా మొబైల్ నంబర్ 9000113667కు ఫోన్ చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సిట్ నివేదికను కాదని విమర్శలా?

(మొదటి పేజీ తరువాయి)




మంత్రులు చెప్పారు. చంద్రబాబును కాపాడటానికి, ఆయన చెప్పిన అబద్ధాల్ని కప్పిపుచ్చడానికే వీళ్ల ప్రయాస తప్ప మరోటి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు కలిపారని ప్రకటించడంతో, వాస్తవాలు నిగ్గు తేల్చాలని వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో, ఏ విషయమూ నిర్ధారణ కాకుండా మాట్లాడొద్దంటూ సూచించిన సుప్రీకోర్టు, ఈ వ్యవహారంపై సిట్ ఏర్పాటు చేసింది. అందులో సీబీఐ అధికారులతో పాటు రాష్ట్ర అధికారులు కూడా ఉన్నారు. సిట్ అధికారులు ఏడాది కాలంగా సుదీర్ఘ విచారణ చేసి నివేదిక ఇచ్చారు. సిట్ అదనపు ఛార్జిషీట్‌లో కానీ, ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ రిపోర్టులో కానీ, చంద్రబాబు ఆరోపించినట్లు నెయ్యిలో జంతువుల కొవ్వు కానీ, చేప నూనె కానీ కలిసినట్లు ఎక్కడా చెప్పలేదు. అయినా చంద్రబాబు ఈ ఛార్జిషీట్‌పై సంతృప్తి చెందకుండా ఇవాళ కేబినెట్ సమావేశంలో నెయ్యి విషయంలో ప్రత్యేక విచారణ చేపడుతున్నట్లు మంత్రులతో బయట ప్రకటన చేయించారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ రిపోర్టు కాకుండా, మళ్లీ విచారణ చేయించాలన్న నిర్ణయం పూర్తిగా తప్పని భూమన అన్నారు. ఒక మంత్రి భోలే బాబాను తెచ్చిన అలీ బాబా ఎవరని ప్రశ్నించారు. ఈ భోలే బాబాను తెచ్చిన చంద్రబాబే. 2018లోనే భోలే బాబా రంగ ప్రవేశం చేశాడు. దాదాపు 87 వేల టిన్నులకు పైగా నెయ్యి ఈ కంపెనీ సరఫరా చేసింది. అది చాలా స్పష్టంగా సీబీఐ నివేదికలోనే ఉంది. కానీ దాన్ని వదిలేసి మా హయాంలోనే నెయ్యి సరఫరా చేసినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నిజంగా తిరుమల శ్రీవారి మీద భక్తి ఉంటే, మీ గత ప్రభుత్వంలో సరఫరా అయిన నెయ్యిపైనా విచారణ చేయించాలి. ఆ రోజు 90 శాతానికి పైగా నెయ్యి సరఫరా చేసిన డెయిరీయే మా హయాంలోనూ సరఫరా చేసిందన్న విషయం మీకు గుర్తు చేస్తున్నాం అని అన్నారు. టీటీడీని రాజకీయ పావుగా వాడుకోకపోతే మీ హయాంలోనే నెయ్యి సరఫరా చేసిన వాళ్లు, కొనుగోళ్లు చేసిన వాళ్ల మీద విచారణ చేయించండి. ఇప్పుడు అనిల్ కుమార్ సింఘాల్ దోషి అంటున్నారు. సిట్ ఏర్పాటు చేశాక జంతుకొవ్వు విమర్శలు చేసిన మీరు ఆయన్ను రెండోసారి ఎందుకు ఈవోగా నియమించారని అన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పదే పదే నెయ్యిలో జంతుకొవ్వు, పందికొవ్వు, చేప నూనె వాడారని దుష్ప్రచారం చేశారు. మీరు ఆరోపించినట్టు ఆ నెయ్యిలో అవేవీ లేవని తేలిపోయింది. అయినా మీరు ఇంకా ఎదురుదాడి చేస్తూ, గత మా ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తిరుమల శ్రీవారిపై భక్తి ఉంటే, ఏ రాజకీయ ప్రయోజనాలు ఆశించకపోతే.. మీ హయాం నుంచే జరుగుతున్న నెయ్యి కల్తీపై విచారణ చేయించమని కోరుతున్నట్లు వెల్లడించారు. మేం నిబంధనల్ని సడలించడం వల్ల నెయ్యి కల్తీ జరిగిందనేది అబద్ధం అని భూమన అన్నారు. కేవలం దురుద్దేశంతో టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మీద నింద వేయాలని చూశారు. ఇప్పుడు మళ్లీ ప్రత్యేకంగా విచారణ చేయిస్తాం అంటున్నారు. నెయ్యి మీద మీరు విచారణలు చేయడం కాదు మళ్లీ సుప్రీంకోర్టుతోనే ఆ పని జరిగేలా చూడాలని భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

జగిత్యాల జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. వ్యవసాయ కూలీలు ఉదయం పసుపు కోతకు వెళ్లారు. పసుపు కోత పూర్తయ్యాక తిరిగి వస్తుండగా మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

## 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియలు ఒకేచోట ఉండేలా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనితో పాటు మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రాన్ని దేశంలోనే అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులను భాగస్వాములను చేస్తూ, సాగు విస్తీర్ణాన్ని 50 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, వారి ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని వివరించారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించేందుకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయాలను ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలన్నారు. సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. సంప్రదాయ పంటలతో పాటు, వాణిజ్యపరంగా లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా, లంబసింగి ప్రాంతంలో స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో కుంకుమపువ్వు సాగు చేపట్టే సంస్థలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో వెనుకబడ్డామని, ఇకపై ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమల బలోపేతానికి కూడా ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఆక్వా రైతులు తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలన్నారు. పౌల్ట్రీ రంగానికి ఊతమిచ్చేలా, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను నేరుగా రైతులకే అప్పగించాలని నిర్దేశించారు. ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి టెక్నాలజీలను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా 'డిజి రైతు బజార్', 'ఏపీఏఐఎంఎస్', 'కిసాన్ డ్రోన్' యాప్‌లను సీఎం ఆవిష్కరించారు. వీటి ద్వారా రైతులు కూరగాయలు ఆన్‌లైన్‌లో అమ్మడం, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు అద్దెకు తీసుకోవడం వంటి సేవలు పొందవచ్చని అధికారులు వివరించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఆర్థిక సాయం అందించిన ఏజేఆర్ ఫౌండేషన్

**వలిగొండ, ఫిబ్రవరి 3 (తొలివెలుగు):** వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పూర్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదయ్య ఇటీవలే గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి స్పందించి, మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఫౌండేషన్ తరపున మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏజేఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇలాంటి కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడం ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలోకి బీఆర్ఎస్ నేతల చేరిక

- తంగడపల్లి 15వ వార్డు నుంచి బీఆర్ఎస్ నేతలు కమలదళంలో చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి






**చౌటుప్పల్, ఫిబ్రవరి 3 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి 15వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. బీజేపీ నాయకుడు ఆలే చిరంజీవి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ గ్యార కృష్ణ, గ్యార సుధాకర్, ఇట్టగొని రమేష్‌తో పాటు వారి అనుచరులు మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీ కండువా కప్పుకుని అధికారికంగా పార్టీలో చేరిక అయ్యారు. తంగడపల్లి చౌరస్తాలో నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమంలో బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ కదరి కల్పన యాదవ్ పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలు, అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దూడల భిక్షం గౌడ్, రమణగోనీ శంకర్, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, పొలోజు శ్రీధర్ బాబు, చీకూరి ప్రభాకర్, తోర్పునూరి లక్ష్మణ్, బత్తుల జనార్దన్, చీకూరి వెంకటేష్, సిల్వేరు సురేష్, తోకల సాయి, కర్తాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య

**కూకట్ పల్లి,** అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆల్విన్ కాలనీ డివిజన్,ఇంద్ర హిల్స్ శంషిగూడలో స్నేహితుతో పాటు కలిసి నివాసముంటున్న జితేందర్ యాదవ్ (26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన సోదరి వివాహం జరగడంతో అప్పులు అయ్యాయి. వాటిని తీర్చలేక మరికొంత అప్పులు చేయవలసి వచ్చింది. దీంతో అప్పుల బాధతో మనస్తాపం చెంది ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# స్థానిక వ్యాపారులను ఆదుకోవాలి

- వలస వ్యాపారులను అరికట్టండి!
- పరాయి రాష్ట్రాల వ్యాపారులతో.. లోకల్ వర్తకులు దివాలా!
- వలిగొండలో జె ఏ సి ఆందోళన.. అధికారులకు వినతి





**వలిగొండ, ఫిబ్రవరి 3 (తొలివెలుగు):** వలిగొండ పట్టణంలో ఇతర రాష్ట్రాల వ్యాపారుల విస్తరణ వల్ల స్థానిక వ్యాపారులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటూ జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక వ్యాపారులను రక్షించేందుకు ఇతర రాష్ట్రాల వారికి షాపులు ఏర్పాటు చేయకుండా కట్టడి చేయాలని వలిగొండ వర్తక - వ్యాపార సంఘం జేఏసీ ప్రతినిధులు సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు జేఏసీ సంఘం ప్రతినిధులు స్థానిక ఎమ్మార్వో, ఎంపీడీఓ, ఎస్సై యుగేందర్ గౌడ్, గ్రామపంచాయతీ సెక్రటరీలకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వర్తక సంఘం అధ్యక్షుడు బెలిదే శ్రీనివాస్ మాట్లాడుతూ.. వలిగొండలో జనాభా తక్కువగా ఉన్నప్పటికీ ఇప్పటికే దుకాణాల సంఖ్య అధికంగా ఉండటంతో స్థానిక వ్యాపారులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు అధిక కిరాయిలు చెల్లించి షాపులు తీసుకోవడం వల్ల స్థానిక వ్యాపారులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కొద్ది నెలలపాటు మాత్రమే వ్యాపారం చేసి వెళ్లిపోతుండటంతో మార్కెట్ స్థిరత్వం దెబ్బతింటోందని పేర్కొన్నారు. స్థానికంగా సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడుతోందని, ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో స్థానిక వ్యాపారులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చేతివృత్తులు, కులవృత్తులపై ఆధారపడి జీవించే ప్రజలు రోజువారీ కూలీలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందని, అలాగే స్థానిక నిరుద్యోగ యువతకు కొత్తగా వ్యాపారం ప్రారంభించే అవకాశాలు తగ్గిపోతాయని తెలిపారు. స్థానిక వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇతర రాష్ట్రాల వారికి షాపులు ఏర్పాటు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని వలిగొండ వర్తక - వ్యాపార సంఘం జేఏసీ అధికారులను విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జానీ అఫ్రోజ్‌తో పాటు వర్తక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




## స్పర్శపై అవగాహన.. పిల్లలకు రక్షణ

- హన్మాపురంలో 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' పై అవగాహన
- ముఖ్య అతిథిగా సీడబ్ల్యూసీ చైర్మన్ జయశ్రీ

**భువనగిరి, ఫిబ్రవరి 3 (తొలివెలుగు):** లైంగిక వేధింపులను నిరోధించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లలందరికీ అవగాహన కల్పించడం అత్యంత అవసరమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ డైరెక్టర్ షేక్ హమీద్ పాషా తెలిపారు. మంగళవారం భువనగిరి మండలం హన్మాపురం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్మన్ బండారు జయశ్రీ, షేక్ హమీద్ పాషా మాట్లాడుతూ చిన్నారులను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంపొందించడం చాలా కీలకమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు సురక్షితమైన స్పర్శ (ప్రేమ) మరియు అసురక్షితమైన స్పర్శ (భయం లేదా అసౌకర్యం) మధ్య తేడాను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ప్రైవేట్ భాగాల గురించి అవగాహన కల్పించి, ఎవరైనా ఇబ్బంది పెడితే 'వద్దు' అని గట్టిగా చెప్పడం, వెంటనే నమ్మకమైన పెద్దలకు తెలియజేయడం అలవాటు చేయాలని అన్నారు. చిన్నా - పెద్ద తేడా లేకుండా ఆడవారిపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు బాధ్యతగా పిల్లలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ రోజూ వారి పాఠశాల, బయటి విషయాలను తెలుసుకోవాలని, వారిలో ఏమైనా భయం లేదా అసహజ ప్రవర్తన కనిపిస్తే కారణాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ విద్యార్థులకు ప్రాక్టికల్ విధానంలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ దశరథ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య, చింత ఉమ (కోశాధికారి), స్వాతి, అనిత, నాగరాణి, ఉపాధ్యాయులు టి. బాలమణి, ఎస్. పద్మ శ్రీదేవి, రహీమున్నిసా తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ కష్టాలను నియంత్రించేందుకు కృషి



**రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి,** ఉషాముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందని, విస్తరణ పనులు వేగంగా చేసి ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తామని అన్నారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలని, రోడ్డు డివైడర్ మధ్యలో సుందరీకరణ పనులు చేపట్టాలని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, పోశెట్టిగౌడ్, సుధాకర్, ఏ.ఇ యుగంధర్ రెడ్డి, యుబిడి నాగరాణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## పులి సంచార ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గ్రామాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టిన జిల్లా యంత్రాంగం
- జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 3 (తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని కొన్ని గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. రాజపేట మండలం బసంతాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి పులి దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన స్థలాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అటవీ శాఖ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. ఇటీవల గ్రామాల సమీప ప్రాంతాల్లో పులి సంచారం పెరిగిన నేపథ్యంలో, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పులి కదలికలను గమనించేందుకు థర్మల్ డ్రోన్ ద్వారా వీడియో చిత్రీకరణ, ట్రాప్ కెమెరాల ఏర్పాటు, అలాగే పులిని బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడవులకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనుల కోసం వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని కలెక్టర్ సూచించారు. రాత్రి సమయంలో పశువులను బయటికి వదలకుండా పశువుల పాకల్లోనే ఉంచి, తగిన వెలుతురు ఏర్పాటు చేయాలన్నారు. పులి కనిపించినట్లు గమనించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు లేదా స్థానిక గ్రామ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పులి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయరాదని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం, అటవీ శాఖ సిబ్బంది కలిసి పులి అడుగు జాడలను నిరంతరం గమనిస్తూ, దానిని పట్టుకుని తిరిగి అడవిలోకి పంపేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా జాగ్రత్తలు పాటిస్తూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.







# శివాజీ విగ్రహ ఏర్పాటుకు రూ. 50 వేల విరాళం

**- ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత జంగారెడ్డి ఉదారత**

**వలిగొండ, ఫిబ్రవరి 3 (తొలివెలుగు) :** మండల పరిధిలోని వెల్వర్తి గ్రామంలో ప్రతిష్టించనున్న ఛత్రపతి శివాజీ విగ్రహం కోసం ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం వెల్వర్తి ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ.. శివాజీ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి సాయం చేసినందుకు యువజన సంఘం సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పల్సం రాజు గౌడ్, చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సామల కొండల రెడ్డి, యూత్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం: అదనపు కలెక్టర్ భాస్కరరావు





**భువనగిరి, ఫిబ్రవరి 3 (తొలివెలుగు):** ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు) కీలక పాత్ర పోషిస్తారని, ఎన్నికల నియమనిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. మంగళవారం భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో పీఓలు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందించే పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ బాక్స్, ప్రిసైడింగ్ అధికారుల డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను తెరవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పోలింగ్ మెటీరియల్‌ను జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఆర్ఓలు తమ బృందంలోని ఎన్నికల సిబ్బందికి నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని 'టీపోల్' యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, పీఓలు, ఏపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఒకే నంబర్.. నాలుగు వాహనాలు

ఒకే నంబర్ ప్లేట్‌పై నాలుగు వాహనాలు.. ఇటీవల హైదరాబాద్‌లో వెలుగుచూసిన వ్యవహారంతో పోలీసులే షాక్ అవుతున్నారు. నంబర్‌ప్లేట్ల దందా చాలారోజులుగా కొనసాగుతున్నప్పటికీ ఎప్పటికప్పుడు వారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. కానీ ట్రాఫిక్ చలాన్లు వస్తే తప్ప అవి కూడా అసలు వాహనాల యజమానులు పోలీసుల దృష్టికి తీసుకొస్తే తప్ప దొంగ నంబర్‌ప్లేట్లన్న విషయం తెలియడం లేదని పోలీసులే చెబుతున్నారు. ఇటీవల వరుసగా ఒకే నంబర్‌తో వేర్వేరు వాహనాలు ఉండి వాటిపై ట్రాఫిక్ చలాన్లు రావడం సాధారణమైపోయింది. నగర ట్రాఫిక్ విభాగంలో ఈ మధ్యకాలంలో నెలకు ఐదారు ఇలాంటివే కేసులు వస్తున్నాయని ట్రాఫిక్ పోలీసులు చెప్పారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో షాకింగ్ విషయం వెలుగుచూసింది. ఒకే రిజిస్ట్రేషన్ నంబర్‌పై నాలుగు ద్విచక్రవాహనాలు రోడ్లపై తిరుగుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. అసలు ఓనర్‌కు తెలియకుండా మరో ముగ్గురు ఇదే నంబర్ ప్లేట్‌తో బైక్‌లు నడుపుతున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగినప్పుడు అసలు యజమానికి చలాన్లు వస్తున్నాయి. దీంతో చలాన్లకు సంబంధించిన ఫొటోలు చూస్తే అసలు విషయం బయటపడింది. హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ఆపి చలాను రాశారు ట్రాఫిక్ పోలీసులు. ఆ చలాను అసలు నంబరు ప్లేట్ కలిగిన బైక్ ఓనర్ బేగరి గోపాల్‌కు చేరడంతో షాక్‌కు గురయ్యాడు. అప్పటికే తన బైక్‌పై (నంబర్ టీఎస్ 34 సీ 1858) పలు చలాన్లు ఉండడంతో వెంటనే ట్రాఫిక్ పోలీసులను ఆశ్రయించారు. చలాన్లు పడ్డ బైక్‌ల ఫొటోలను ట్రాఫిక్ పోలీసుల సహాయంతో చూడగా ఆ వాహనాలు తనవి కాదని గోపాల్ గుర్తించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, వాహనరికార్డులను పరిశీలించగా ఒకే నంబర్ ప్లేట్‌తో నాలుగు వాహనాలు నగరంలో తిరుగుతున్నట్లు గుర్తించారు.

# చౌటుప్పల్ మున్సిపాలిటీలో 'చేయి' జారే పరిస్థితి?

## చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తి జ్వాల

## విపక్షాల అనధికారిక పొత్తులు.. కాంగ్రెస్‌కు షాక్ ఇవ్వనున్నాయా?

## గెలిచే వార్డులు కూడా ప్రమాదంలో పడనున్నాయా?

## విపక్షాల 'అనధికార' పొత్తులతో కాంగ్రెస్‌కు వణుకు!

**చౌటుప్పల్, ఫిబ్రవరి 3 (తొలివెల4ుగు) :**

చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల రణక్షేత్రం రోజురోజుకూ అనూహ్య మలుపులు తిరుగుతోంది. మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని ధీమాతో ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీకి, విపక్షాల వ్యూహాత్మక ఎత్తుగడలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం పార్టీల మధ్య సాగుతున్న 'అనధికారిక' అవగాహన రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేసేలా కనిపిస్తోంది.

**కాంగ్రెస్‌లో ముదిరిన 'బీ-ఫారం' చిచ్చు**

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. బీ-ఫారం దక్కని ఆశావహులు రెబల్స్‌గా మారే అవకాశం ఉండటం, స్థానిక నేతల మధ్య సమన్వయ లోపం పార్టీని బలహీనపరుస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో పోటీ మరింత తీవ్రమైంది. ఈ అంతర్గత విభేదాలు ఇప్పటికే గెలిచే అవకాశాలున్న వార్డుల్లోనూ ఓటమి భయాన్ని కలిగిస్తున్నాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**విపక్షాల వ్యూహంలో కింగ్‌మేకర్ ఎవరు?**

ఒంటరిగా పోటీ చేస్తే పూర్తి మెజారిటీ సాధించడం కష్టమనే అంచనాతో బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు కాంగ్రెస్‌ను నిలువరించేందుకు పరస్పర సహకారం దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్: స్థానికంగా ఉన్న బలమైన క్యాడర్‌ను ఉపయోగించి అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలచుకోవాలని ప్రయత్నిస్తోంది.

**బీజేపీ:** పరిమిత సీట్లతోనైనా నిర్ణయాత్మక శక్తిగా మారి కింగ్‌మేకర్ పాత్ర పోషించాలన్న వ్యూహంతో ముందుకు సాగుతోంది.

**సీపీఎం:** అభివృద్ధి, ప్రజాసమస్యల పేరుతో కాంగ్రెస్‌కు వ్యతిరేక ఓటు బ్యాంకును సమీకరించేందుకు యత్నిస్తోంది




### పోస్ట్-పోల్ పాలిటిక్స్ క్యాంపు రాజకీయాలకు తెర?

ఎన్నికల ఫలితాల అనంతరం అసలైన రాజకీయ డ్రామా మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోతే, విపక్షాలు ఏకమై కాంగ్రెస్‌కు చైర్మన్ పీఠం దక్కకుండా చేసే ప్రమాదం పొంచి ఉందని అభిప్రాయపడుతున్నారు. దీనిని ఎదుర్కొనేందుకు అధికార పార్టీ నేతలు ఇప్పటికే క్యాంపు రాజకీయాలు, పోస్ట్-పోల్ సమీకరణాలపై దృష్టి సారిస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. మొత్తానికి చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికలు కేవలం వార్డు గెలుపులకే పరిమితం కాకుండా, వ్యూహప్రతివ్యూహాల మధ్య అత్యంత రసవత్తరంగా మారాయి. ఓటర్ల తీర్పు ఎవరిని వరిస్తుందన్నదే కాదు, ఆ తర్వాత జరిగే రాజకీయ లెక్కలే మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరి చేతికి చేరుతుందో తేల్చనున్నాయి. విపక్షాల అనధికారిక పొత్తులు కాంగ్రెస్‌కు చెక్ పెడతాయా? అన్నది వేచి చూడాల్సిందే.


# విద్యుత్ వినియోగదారులకు షాక్

**దక్షిణ డిస్కంలో కొత్త నిబంధనలు.. కేటగిరీ మార్పుతో చార్జీల భారం**

**కరెంట్ బిల్లులు మూడింతలు పెరిగే చాన్స్**

**పదిలక్షల మంది వినియోగదారులపై ప్రభావం**

విద్యుత్ వినియోగదారులకు దక్షిణ డిస్కం తీసుకొస్తున్న కొత్త నిబంధనలు భారంగా మారుతున్నాయి. పాత బిల్డింగుల్లో అదనపు లోడ్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎవరికైతే ఓసీలు లేవో వారు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లతో పాటు దరఖాస్తు చేయాలని అధికారులు చెప్పారు. ఇదిలా ఉంటే పాత బిల్డింగులలో పర్మిషన్ లేని ఫ్లోర్లకు సంబంధించి కనెక్షన్ల విషయంలో తీసుకుంటున్న నిర్ణయంతో టీజీఎస్‌పీడీసీఎల్ వినియోగదారుల నడ్డి విరుస్తోంది. విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఓసీలు లేవని, పర్మిషన్లు లేవనే పేరుతో కనెక్షన్లు ఇవ్వకపోగా.. ఇప్పటికే కనెక్షన్ తీసుకున్నవారికి నిబంధనల పేరుతో అడ్డగోలుగా బిల్లులు వేస్తున్నది. నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థల ఆదాయాన్ని పెంచుకోవడానికి విద్యుత్ చార్జీలు పెంచకుండానే పరోక్షంగా ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ రకరకాల నిబంధనలను తెరమీదికి తీసుకువస్తున్నారు. ఇప్పటికే 20 కిలోవాట్స్ ఉన్న వారు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని, గదులను బట్టి వాట్స్ తీసుకోవాలంటూ నిబంధన విధించిన డిస్కం అనుమతులు లేని ఫ్లోర్లకు తాత్కాలిక కేటగిరీ కింద బిల్లుల వడ్డింపుపై దృష్టిపెట్టింది. ఈ నిబంధన అమలులోకి వస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో ఎనిమిది నుంచి పదిలక్షల మంది విద్యుత్ వినియోగదారులపై ఈ ప్రభావం పడనుంది. కేటగిరీ మారిస్తే సదరు విద్యుత్ వినియోగదారుడికి ప్రస్తుతం వస్తున్న బిల్లు కంటే మూడింతలు అధికంగా బిల్లు వచ్చే అవకాశముంది. ఆక్యుపెన్సీ ప్రామాణికంగా కేటగిరీలు మారిస్తే మెజారిటీ చార్జీల భారం అద్దెకు ఉంటున్న వారిపై పడుతుంది. నగరంలో ప్రస్తుతం 67లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో హెచ్‌టీ




(పరిశ్రమల)కమర్షియల్ కనెక్షన్లు పదిలక్షల వరకు ఉంటాయి. అవి కాకుండా మరో 57లక్షల వరకు గృహ విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. ఈ డొమెస్టిక్ కనెక్షన్ల వద్దనే అసలు సమస్య ఉత్పన్నం అవుతున్నట్లు విద్యుత్ రంగ నిపుణులు చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు నుంచి ముప్పై అంతస్తుల వరకు పెద్ద పెద్ద భవనాల నిర్మాణం జరుగుతుంది. ఇందులో కొన్నింటికి రెండు మూడు అంతస్తుల వరకే అనుమతులు ఉంటే అంతకుమించి ఉన్న సముదాయాలే ఎక్కువగా ఉంటాయి. వాటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో అనుమతి ఉన్నంత వరకే తీసుకుని తర్వాత మిగిలినవాటికి కూడా విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. అవి ప్రస్తుతం డొమెస్టిక్‌గానే ఉన్నాయి. ప్రస్తుతం దక్షిణ డిస్కం అధికారులు చెబుతున్న ప్రకారం ఈ కనెక్షన్లలో డొమెస్టిక్‌నుంచి టెంపరరీగా మారితే బిల్లు మోత మోగుతుంది. డిస్కమ్ నిర్ణయించిన స్లాబ్ ప్రకారం వీరికి మూడువందల యూనిట్ల వరకు బిల్లులు వస్తుంటే వాటికి వేయి రూపాయల నుంచి పదిహేనువందల వరకు బిల్లు వస్తుంది. అంటే యూనిట్‌కు ఐదు నుంచి ఏడురూపాయలు వసూలు చేస్తున్నారు. కానీ టెంపరరీ కేటగిరీకి మారితే యూనిట్‌కు రూ.11 కంటే పైనే ఉంటుందని తెలుస్తున్నది. ప్రస్తుతం విద్యుత్ అధికారులు ఆక్యుపెన్సీ లేకుండా ఇచ్చిన కనెక్షన్లను గుర్తించి వాటికి నోటీసులు జారీ చేశారు. ఇంటి నిర్మాణానికి స్థానిక సంస్థలు ఇచ్చిన అనుమతులు పరిశీలించి అవి ఎన్ని అంతస్తుల వరకు ఉన్నాయో చూసి మిగతావాటిని కేటగిరీ 8 అంటే తాత్కాలిక అనుమతుల్లోకి మార్చడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో సదరు వినియోగదారుడికి బిల్లు సాధారణంగా వచ్చేదానికంటే మూడింతలు ఎక్కువగా వస్తుందని అధికారులు చెప్పారు. ఈనేపథ్యంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చే వరకు ఈభారం భరించాల్సిందేనని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవడానికి గత సంవత్సరమే ఆలోచించినా అప్పట్లో ఓసీలపైనే ఎక్కువ దృష్టి పెట్టామని, ఈసారి ఈ కొత్త విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వారు తెలిపారు. కరెంట్ చార్జీల పెంపు లేదంటూనే దక్షిణ విద్యుత్ సంస్థ తీసుకొస్తున్న నిబంధనలు విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతున్నది. అనుమతులు లేని ఫ్లోర్లను కేటగిరీ 8లోకి మార్చే క్రమంలో ఆ భారం అందులో అద్దెకు ఉండే వారిపై పడుతుందని వినియోగదారులు చెప్పారు. నగరంలో ఉన్న గృహ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే సమయంలో స్థానిక విద్యుత్ అధికారులు కేవలం తమకు ఆదాయం రావడమే లక్ష్యంగా సంస్థాగతంగా వారికి కనెక్షన్లు ఇచ్చారు తప్ప వారికి ఎలాంటి పర్మిషన్లు ఉన్నాయనేది పరిశీలించలేదు. గత ఆరునెలలుగా సంస్థ డైరెక్టర్లు వచ్చినప్పటి నుంచి కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చి వినియోగదారుల సంక్షేమంతో పాటు సంస్థ ఆదాయానికి గండిపడేలా నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో భాగంగానే అదనపు ఫ్లోర్లకు అనుమతులు, కొత్త బిల్డింగుల పర్మిషన్లు, ఓసీలు.. ఇలా పలు రకాల నిబంధనలతో విద్యుత్ కనెక్షన్లను కఠినతరం చేశారు. ఇది ఎవరికి లాభమో తెలియదు కానీ పూర్తిగా సంస్థకు నష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారమంతా చూసుకోవలసిన జీహెచ్ఎంసీ తమకేమీ పట్టనట్లుగా ఉంటున్నదని కొందరు సీనియర్ విద్యుత్ అధికారులు చెప్పారు.



# అమ్మకాల్లో సరికొత్త రికార్డ్: 5 లక్షల మంది కొన్నారు!

భారతదేశంలో బజాజ్ చేతక్ లాంచ్ అయినప్పటి నుంచి ఐదు లక్షల అమ్మకాలను అధిగమించింది. నవంబర్ 2023లో 1,00,000 అమ్మకాల మైలురాయిని చేరుకున్న ఈ స్కూటర్.. తాజాగా 5,10,000 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. 2020లో ఇండియన్ మార్కెట్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి బజాజ్ చేతక్ 46 నెలల్లో లక్ష యూనిట్ల అమ్మకాల మైలురాయిని చేరుకుంది. అయితే గడిచిన 10 నెలల కాలంలోనే 2.06 లక్షల కంటే ఎక్కువ సేల్స్ పొందగలిగింది. మొత్తం మీద ఐదు లక్షల సేల్స్ అధిగమించింది. దీన్నిబట్టి చూస్తే దేశీయ విఫణిలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. బజాజ్ చేతక్ అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణం.. ఇది 3001, 3501, 3502, 3503 అనే వేరియంట్లలో అందుబాటులో ఉండటం మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా 3,800 కంటే ఎక్కువ టచ్‌పాయింట్‌లతో కూడిన సర్వీస్ నెట్‌వర్క్ కూడా అని తెలుస్తోంది. ఈ స్కూటర్లు లేటెస్ట్ డిజైన్ కలిగి.. 3 కిలోవాట్ బ్యాటరీ, 3.5 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలో అబందుబాటులో ఉన్నాయి. దీని ప్రారంభ ధర రూ.99,900 (ఎక్స్ షోరూమ్).

## జీఎస్టీ 2.0 ఎఫెక్ట్: భారీగా తగ్గనున్న టీవీ ధరలు



దిల్లీ: రేపటి నుంచి కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను బదిలీ చేసేందుకు టెలివిజన్ తయారీదారులు తమ ఉత్పత్తుల ధరలను తగ్గించారు. టీవీల మీద రూ.2,500 నుంచి రూ.85,000 వరకు తగ్గింపు ప్రకటించారు. దీంతో వినియోగదారులకు పండగ సీజన్ ఆఫర్లతో పాటు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనమూ కలిసి రానుంది. 32 అంగుళాల పైబడిన టీవీలపై జీఎస్టీ రేటు 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. దీంతో తయారీదారులు స్క్రీన్ సైజులు, స్పెసిఫికేషన్ల ఆధారంగా ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. సోనీ, ఎల్‌జీ, పానాసోనిక్ వంటి అగ్ర టీవీ బ్రాండ్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చే కొత్త ధరల జాబితాను విడుదల చేశాయి. టీవీలతో పాటు సౌండ్ బార్లు, పార్టీ స్పీకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరుగుతాయని అంచనా. ఏ టీవీపై ఎంత రేటు తగ్గిందో చూద్దాం.

**సోనీ ఇండియా..**

- 43 నుంచి 98 అంగుళాల వరకు ఉన్న బ్రావియా టీవీ మోడళ్లపై రూ.5వేల నుంచి రూ.71 వేల వరకు ధరలు తగ్గించనుంది.
- 43 అంగుళాల బ్రావియా 2 రూ.59,900 నుంచి రూ.54,900కి తగ్గనుంది.
- 55 అంగుళాల టీవీ 7 ధర రూ.2.80 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు తగ్గింది.
- 98 అంగుళాల టాప్ ఎండ్ బ్రావియా 5 రూ.9 లక్షల నుంచి రూ.8.29 లక్షలకు దిగి రానుంది.
- ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా..
- • 43 అంగుళాల నుంచి 100 అంగుళాల వరకు ఉన్న మోడళ్లపై రూ.2,500 నుంచి రూ.85,800 వరకు ధరలు తగ్గిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.
- 43 అంగుళాల మోడల్ రూ.30,990 నుంచి రూ.28,490 వరకు తగ్గనుంది.
- 65 అంగుళాల టీవీ ధర రూ.71,890 నుంచి రూ.68,490 తగ్గనుంది.

# ఇంటిపై సౌరకాంతులు!

## పెరుగుతున్న నెలవారీ విద్యుత్ చార్జీలు

## ప్రత్యామ్నాయం దిశగా వినియోగదారుల అడుగులు

## గ్రేటర్‌లో రూఫ్‌టాప్ నెట్‌మీటరింగ్‌కు పెరుగుతున్న ఆదరణ

## అందుబాటులోకి 'పీఎం ముఫ్త్ బిజ్లీ యోజన పథకం' పోర్టల్

## నెలకు 300 యూనిట్లు ఉచితం.. రాయితీపై బ్యాంకు రుణ సౌలభ్యం



హైదరాబాద్‌లోనే అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీగా గుర్తింపు పొందిన మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్స్‌పై నిర్వాహకులు 250 కిలోవాట్స్ సోలార్ రూఫ్ టాప్ పలకను ఏర్పాటు చేసుకున్నారు. రోజుకు సగటున వెయ్యి యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. నెలకు సగటున రూ.3 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోంది. ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్వాహకులు పెట్టిన పెట్టుబడి అంతా మరో ఐదేళ్లలో తీరిపోతోంది. ఆ తర్వాత వారికి పూర్తిగా సోలార్ విద్యుత్ ఉచితంగా అందనుంది. ఇలా వీరొక్కరే కాదు గ్రేటర్‌లో సుమారు 3,500 మంది వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుని, సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఇంటిపై ఉత్పత్తి అయిన విద్యుత్‌తో సొంత అవసరాలు తీర్చుకుంటూ.. మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లలో సౌర విద్యుత్ వెలుగులు నింపే లక్ష్యంతో తాజాగా కేంద్రం 'పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజ్లీ యోజన' పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి నెలకు సగటున 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఉచితంగా అందించే కార్యక్రమంలో భాగంగా కొత్తగా రూఫ్‌టాప్ సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలని భావించే వారికి పలు ప్రోత్సాహకాలు అందజేస్తుంది. ఇంటిపై మూడు కిలోవాట్ల సౌరపలకలు ఏర్పాటు చేయాలంటే 225 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరం. ఒక కిలోవాట్ సౌరపలక రోజుకు సగటున 4 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న పలకలు ఏర్పాటు చేసుకుంటే నెలకు సగటున 360 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఏడాదికి 4,320 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఇంటి అవసరాలు నెలకు 200 యూనిట్లు పోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకోవచ్చు. ఇందుకు ప్రస్తుత ధర ప్రకారం యూనిట్‌కు రూ.5.05 చెల్లిస్తుంది. మూడు కిలోవాట్లకు రూ.1.80 లక్షలు ఖర్చవుతుంది. గతంలో రాయితీ కిలోవాట్‌కు రూ.14 వేల చొప్పున మూడు కిలోవాట్లకు రూ.42 వేలు లభించేది. దీంతో చాలామంది విముఖత చూపేవారు. ప్రస్తుతం ఈ సబ్సిడీని రూ.78 వేలకు పెంచింది. అంతేకాదు మిగిలిన మొత్తం చెల్లింపునకు రాయితీపై బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా కేంద్రం ఏర్పాటు చేసింది. ఒక రకంగా చెప్పాలంటే పైసా ఖర్చు లేకుండా యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఉత్పిత్తి అయిన విద్యుత్‌లో ఇంటి అవసరాలు పోగా, మిగిలిన విద్యుత్‌ను నెట్‌మీటరింగ్ ద్వారా డిస్కంకు విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో బ్యాంకు రుణం తీర్చవచ్చు.

### 40 మందికిపైగా దరఖాస్తు

సౌరపలకల జీవితకాలం 25 ఏళ్లను పరిగణలోకి తీసుకుంటే 5.32 సంవత్సరాల్లోనే పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి వస్తుందని చెబుతున్నారు. మిగిలిన కాలానికి ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. సౌర విద్యుత్‌తో పర్యావరణ ప్రయోజనాలు లేకపోలేదు. మూడు కిలోవాట్ల సోలార్ ప్యానల్ల ఏర్పాటుతో 25 ఏళ్లలో 85 టన్నుల కార్బన్‌డైయాక్సైడ్‌ను తగ్గించిన వారవుతారు. ఇదిలా ఉంటే సోలార్ విద్యుత్ ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో 'పీఎం సూర్య ఘర్' పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే గ్రేటర్ జిల్లాల నుంచి 40 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఔత్సాహికులు టీఎస్ఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి డిస్కం పేరు, కరెంట్ కనెక్షన్, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఆధార్ నంబర్ వంటి వివరాలను పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. ఎంపిక చేసిన కంపెనీల సోలార్ పలకలు, రాయితీపై రుణాలు ఇచ్చే బ్యాంకులు, టెక్నీషియన్ల వివరాలు ఉంటాయి. పలకల ఇన్‌స్టాలేషన్ తర్వాత నెట్‌మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు.

# ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్‌లో భారత్ టాప్



## అంతర్జాతీయ మెచ్యూరిటీ సూచీలో స్థానం

## కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారత కో%-%వర్కింగ్ స్పేస్ మార్కెట్ అంతర్జాతీయ మెచ్యూరిటీ సూచీలో మొదటి స్థానంలో నిలిచినట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. యూకే, ఫ్రాన్స్, యూఎస్, జపాన్, సింగపూర్ మార్కెట్లను భారత్ వెనక్కి నెట్టేయడం గమనార్హం. 'ఫ్లెక్సిబుల్ ఆఫీస్‌లో ప్రపంచ ధోరణలు, 2025' పేరుతో ఈ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. "ప్రపంచ వ్యాప్తంగా వివిధ మార్కెట్లలోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ భిన్నంగా ఉంది. కొన్ని అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ పెద్ద స్థాయిలో లేదు. అదే కొన్ని వర్ధమాన మార్కెట్లలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ ప్రొవైడర్లు బలమైన ప్రాతినిధ్యం కలిగి ఉన్నారు"అని తెలిపింది. కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ మెచ్యూరిటీ ఇండెక్స్‌లో భారత్ 100 స్కోరు సాధించింది. ప్రపంచంలో పేరొందిన ఆఫీస్ మార్కెట్లు అయిన యూకే 98, ఫ్రాన్స్ 97, యూఎస్ 81, జపా న్, సింగపూర్ 77% స్కోరుతో భారత్ కంటే వెనుకునే ఉన్నాయి. మొత్తం ఆఫీస్ స్పేస పరిమాణంలో ఫ్లెక్సిబుల్ స్పేస (అన్ని వసతులతో, కోరుకున్నన్ని రోజులకు అద్దెకు లభించేది) ఎంతుంది? ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ ప్రొవైడర్ల సంఖ్య ఆధారంగా కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈ నివేదికను రూపొందించింది.

# నిస్సాన్ మాగ్నైట్‌కు రీకాల్: 1500 కార్లు వెనక్కి!



నిస్సాన్ కంపెనీ అక్టోబర్ 2024లో మాగ్నైట్ ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను విడుదల చేసింది. దీంతో సంస్థ లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ సెటప్‌తో భారతదేశంలో తయారు చేసిన మాగ్నైట్‌ను సౌదీ అరేబియాకు ఎగుమతి చేయడం ప్రారంభించింది. అదే సమయంలో దేశీయ విఫణిలో విక్రయించడానికి కూడా ఉత్పత్తి చేస్తోంది. కాగా ఇప్పుడు సౌదీ అరేబియా మార్కెట్లో విక్రయించిన నిస్సాన్ మాగ్నైట్ కోసం బ్రాండ్ రీకాల్ జారీ చేసింది. బ్రేక్ పైపు, హీట్ షీల్డ్ మధ్య తగినంత ఖాళీ లేకపోవడం వల్ల కలిగే భద్రతా సమస్యను నిస్సాన్ గుర్తించింది. ఇది బ్రేక్ పెడల్ పనితీరును దెబ్బతీస్తుందని.. ప్రమాదానికి కారణమవుతుందని కంపెనీ వెల్లడించింది. బ్రేక్ ఫ్లూయిడ్ లీకేజీకి కూడా దారితీస్తుందని కూడా సంస్థ పేర్కొంది. ఇప్పుడు ఈ సమస్యను పరిష్కరించడానికి నిస్సాన్ రీకాల్ జారీచేసింది. ఈ రీకాల్ నిర్ణయం సౌదీ అరేబియాలోని మొత్తం 1,552 యూనిట్ల మాగ్నైట్ ను ప్రభావితం చేయబోతోంది. అయితే నిస్సాన్ మోటార్ ఇండియా భారతదేశానికి సంబంధించిన మోడళ్లకు ఎటువంటి రీకాల్ జారీ చేయలేదు. భారతదేశం, సౌదీ అరేబియాలో విక్రయించే నిస్సాన్ మాగ్నైట్ మోడల్‌లు ఒకే విధమైన స్పెసిఫికేషన్‌లను పంచుకుంటాయి. తేడా ఏమిటంటే ఇండియాలో రైట్ హ్యాండ్ డ్రైవ్ కాన్ఫిగరేషన్ అయితే.. సౌదీ అరేబియాలో లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్. ఈ కారణంగానే బ్రేక్ ఫ్లూయిడ్ పైపుల రూటింగ్ అనేది కొంత భిన్నంగా ఉంటుంది. ఇదే సమస్యకు దారితీసినట్లు స్పష్టమవుతోంది.

# ఈ స్కూటర్ల ఓనర్లకు గుడ్‌న్యూస్ చెప్పిన కంపెనీ



దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తమ కస్టమర్లకు మంచి కబురు చెప్పింది. దేశవ్యాప్తంగా 500 ఎక్స్ పీరియన్స్ సెంటర్ (ఈసీ)లను అధిగమించింది. ఇది దాని రిటైల్ విస్తరణలో ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది. గత మూడు నెలల్లో (జూన్-ఆగస్టు 2025), ఏథర్ 101 కొత్త ఈసీలను జోడించింది. "మా వృద్ధి భారతదేశం అంతటా ఎలక్ట్రిక్ మొబిలిటీకి పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది" అని ఏథర్ ఎనర్జి చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రవ్నీత్ సింగ్ ఫోకెలా అన్నారు. "దక్షిణ భారతదేశం మా కంచుకోటగా నిలిచినప్పటికీ, రిజ్తా విజయం టైర్-2, 3 నగరాల్లో మా విస్తరణను వేగవంతం చేసింది" అన్నారు. ఆగ్రా, జబల్పూర్, బిలాస్పూర్, వడోదర, సుందర్గఢ్ వంటి నగరాల్లో ఏథర్ ఇప్పుడు ఈసీలను కలిగి ఉంది. అలాగే కాలికట్, గుంటూరు, హల్ద్వానీ, కోటా వంటి పట్టణాల్లోకి చొచ్చుకుపోయింది. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఒక్కో చోట 50కి పైగా ఈసీలు ఉన్నాయి. బెంగళూరులో ఏకంగా 18 కేంద్రాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఏథర్ మార్కెట్ వాటా 2026 తొలి త్రైమాసికంలో 14.3 శాతానికి పెరిగింది. గత సంవత్సరం ఇది 7.6% ఉండగా రెట్టింపు అయింది. మధ్య భారతదేశంలో వాటా 10.7 శాతానికి పెరిగగా, దక్షిణ భారతదేశంలో 22.8 శాతంతో ఆధిపత్యాన్ని చాటింది.



# యంగ్ లుక్ తో అదరగొడుతున్న

## ఫొటోలు ఇవిగో! బెస్ట్ డిజైన్ రూపొందిస్తే బహుమతి

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న కొత్త చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి చిత్ర బృందం సరికొత్త హెచ్‌డీ స్టిల్స్‌ను విడుదల చేసింది. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా రిలీజ్ చేసిన ఫొటోల్లో మెగాస్టార్ చిరంజీవి తనదైన స్టైల్, ఎనర్జీతో ఆకట్టుకుంటున్నారు. ఈ స్టిల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా అభిమానులను ఉత్తేజపరుస్తూ ఓ ప్రత్యేక పోటీని కూడా ప్రారంభించారు. విడుదల చేసిన కొత్త స్టిల్స్‌తో క్రియేటివ్ డిజైన్లు రూపొందించాలని, వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రత్యేక '%మీ+%' మర్చండైజ్ బహుమతిగా అందిస్తామని తెలిపారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ భారీ మల్టీస్టారర్ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార, కేథరిన్ త్రెసా నటిస్తున్నారు. ఇందులో విక్టరీ వెంకటేశ్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇద్దరు స్టార్ హీరోల కలయికలో వస్తున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.



# బాలీవుడ్ బ్యూటీ శిల్పా శెట్టిని వెంటాడుతున్న కష్టాలు..

## ముంబయి రెస్టారెంట్‌లో ఐటీ సోదాలు..!

బాలీవుడ్ నటి శిల్పాశెట్టికి కష్టాలు కొనసాగుతున్నాయి. నటికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ బాస్టియన్‌పై బెంగళూరులో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు కేసు నమోదైంది. తాజాగా ముంబయిలోని శిల్పా శెట్టి రెస్టారెంట్‌పై ఆదాయపు పన్నుశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పన్ను ఎగవేత ఆరోపణలపై పలు కంపెనీలపై ఆదాయపు పన్నుశాఖ దాడులు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో శిల్పా శెట్టి హోటల్ సైతం ఉందని పేర్కొన్నారు. బుధవారం నుంచి ముంబయి, పరిసర ప్రాంతాల్లోని సుమారు 20 నుంచి 24 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సోదాలలో శిల్పా శెట్టికి చెందిన ఒక రెస్టారెంట్, మరికొన్ని కార్యాలయాలు ఉన్నాయని వర్గాలు తెలిపాయి. బాస్టియన్ రెస్టారెంట్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, పన్ను అవకతవకలపై అధికారులు పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇన్ కం ట్యాక్స్ అధికారులు ముంబయిలోని ఇంటిపై దాడులు చేశారన్న వార్తను శిల్పా శెట్టి ఖండించింది. మహారాష్ట్ర పోలీసులు శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రాపై మోసం ఆరోపణలపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌తో గానీ, నిబంధనలకు విరుద్ధంగా రెస్టారెంట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై బెంగళూరులో నమోదైన కేసుతో గానీ, ఐటీ సోదాలకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు పేర్కొన్నారు. బెంగళూరులోని బాస్టియన్ రెస్టారెంట్‌కు శిల్పాశెట్టి కో ఓనర్‌గా ఉన్నట్లు సమాచారం. రెస్టారెంట్‌లో బాలీవుడ్ నటికి యాజమాన్య హక్కులు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. శిల్పా శెట్టి, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రా రూ.60కోట్ల మోసం చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఇటీవల సోషల్ మీడియా వేదికగా శిల్పా క్లారిటీ ఇచ్చారు. ఈ కేసులో తాను విచారణకు సహకరించినట్లుగా తెలిపారు.

# పేరు ముందు ట్యాగ్ వద్దనుకున్నా!



అంతర్జాతీయ ప్రమాణాలతో 'డెకాయిట్' చిత్రాన్ని తీశామన్నారు హీరో అడివి శేష్. షానియల్ డియో దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ లవ్, యాక్షన్ డ్రామా టీజర్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ప్రేమ, దోపిడీ ప్రధానాంశాలుగా సాగే ఈ కథలో అడివి శేష్ మాస్ అండ్ రగ్గడ్ పాత్రలో కనిపించారు. ఆయన క్యారెక్టర్ మల్టీషేడ్స్‌తో ఆకట్టుకుంది. యాక్షన్ సన్నివేశాలు రోమాంచితంగా సాగాయి. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సినిమాకు సునీల్ నారంగ్ సహనిర్మాత. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ 'దర్శకుడు షానియల్ డియో నా బెస్ట్ ఫ్రెండ్. ఇద్దరం యూఎస్‌లో కలిసి పెరిగాం. ఒకరి సంస్కృతిని ఒకరం అర్థం చేసుకొని మంచి హైబ్రిడ్ సినిమా చేశాం. తను సాంకేతికంగా హాలీవుడ్ స్టైల్లో తీశాడు. నాగార్జున 'హలో బ్రదర్' సినిమాలోని 'కన్నెపెట్టరో కన్ను కొట్టరో..' పాటను బీజీఎం కోసం ఉపయోగించాం' అన్నారు. ఇప్పటికీ చాలా సినిమాల్లో నటించినా పేరు ముందు ట్యాగ్ ఎందుకు పెట్టుకోలేదని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు అడివి శేష్ బదులిస్తూ 'చిన్నప్పుడే అమ్మానాన్న నాకు 'అడివి శేష్' అనే ట్యాగ్ ఇచ్చారు. అందుకే మరో ట్యాగ్ వద్దనుకున్నా. ఏదో ఒక ట్యాగ్ పెట్టుకోవడం నాకు నచ్చదు. మంచి సినిమాలతో నటుడిగా గుర్తుండిపోవాలన్నదే నా అభిమతం' అని చెప్పారు.

# హారర్ థ్రిల్లర్‌లో రామ్?

ఇటీవల 'ఆంధ్రకింగ్ తాలూకా' చిత్రంలో ప్రేక్షకుల ముందుకొచ్చారు హీరో రామ్. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. గత కొంతకాలంగా కెరీర్‌లో హిట్ కోసం ఎదురుచూస్తున్నారు రామ్. ఈ నేపథ్యంలో ఆయన తన పంథాను మార్చుకొని తొలిసారి ఓ హారర్ థ్రిల్లర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కిషోర్ గోపు దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని ఆర్కా మీడియా సంస్థ నిర్మించనుందని సమాచారం. ఈ సినిమా కథా రూపకల్పనలో రామ్ కూడా భాగమయ్యారని, రెగ్యులర్ ఫార్మాట్‌కు భిన్నమైన ఈ కథపై ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఫిల్మ్ నగర్ టాక్. జనవరిలో తొలివారంలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడుతుందని, అదే నెలాఖరులో షూటింగ్ ప్రారంభమవుతుందని వార్తలొస్తున్నాయి.

